బార్‌లకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో 17 నూతన బార్ షాపుల ఏర్పాటుకు నోటిఫికేషన్ విడుదల చేసినట్లు ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ డి.శ్రీకాంత్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 26వ తేదీ సాయంత్రం ఐదు గంటల వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. శ్రీకాకుళం నగరంలో 11, పలాసలో 2, ఆమదాలవలసలో 2, ఇచ్ఛాపురంలో 2 బార్‌లకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. ఒక వ్యక్తి ఎన్ని బార్‌లకైనా దరఖాస్తు చేసుకోవచ్చని స్పష్టం చేశారు. 28న నగరంలోని అంబేద్కర్ ఆడిటోరియంలో లాటరీ పద్ధతిలో బార్‌ల కేటాయింపు ఉంటుందని తెలిపారు. లైసెన్స్ ఎంపిక పారదర్శకంగా ఉంటుందని పేర్కొన్నారు.

ఆమదాలవలస : జలమయమైన వరి పంట పొలాలు

400 ఎకరాల్లో వరి నీటమునక

- వంశధారకు వరద
- గరిష్టంగా 22 వేల క్యూసెక్కుల ప్రవాహం
- పలుచోట్ల పొంగిన వాగులు, గెడ్డలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి, కొత్తూరు

అల్పపీడన ప్రభావంతో మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు 400 ఎకరాల్లో వరి పంట నీట మునిగినట్లు అధికారులు ప్రాథమికంగా గుర్తించారు. సరుబుజ్జిలి, బూర్జ, ఆమదాలవలస, శ్రీకాకుళం, గార మండలాల్లోని పల్లపు భూములు వరద నీటి ప్రభావానికి లోనైనట్లు అధికారులు వెల్లడించారు. వర్షాలకు వాగులు, గెడ్డలు పొంగిపొర్లాయి. అటు ఒడిశాలోని వంశధార క్యాచ్‌మెంట్ ఏరియాలో వర్షాలు పడడంతో వంశధారలో నీటి ప్రవాహం పెరిగింది. మంగళవారం ఉదయం ఆరు గంటల సమయానికి ఇన్‌ఫ్లో 22 వేల క్యూసెక్కుల ప్రవాహం నమోదైంది. హిరమండలం గొట్టాబ్యారేజీ వద్ద 11 గేట్లను 20 సెంటీమీటర్లు, ఎనిమిది గేట్లను 40 సెం.మీ మేర ఎత్తి 20,651 క్యూసెక్కుల నీటిని కింది విడిచిపెట్టారు. ఒడిశాలో వర్షాలు తగ్గుముఖం పట్టడంతో వరద ప్రవాహం పెరిగే అవకాశం లేదని అధికారులు చెప్తున్నారు. నాగావళిలో వరద ప్రవాహం తగ్గుముఖం పట్టింది. శ్రీకాకుళం నగరం పాత వంతెన వద్ద ఈనెల 18న 16 వేల క్యూసెక్కుల నీరు ప్రవహించగా, ప్రస్తుతం ఐదు వేల క్యూసెక్కులకు తగ్గింది.

ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులు, గెడ్డలు

కొత్తూరు మండలం మడ్డుబగ్గి సాగునీటి కాలువ పొంగిపొర్లింది. కాలువలో చెత్తా చెదారం పేరుకుపోవడంతో వరదనీరు స్థానిక రెల్లివీధి ఇళ్లలోకి చేరడంతో ఇబ్బందులు పడ్డారు. హడ్డుబంగి గెడ్డలోని చెత్తా చెదారాలను, ఆక్రమణలను తొలగించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు శిర్ల ప్రసాద్ డిమాండ్ చేశారు. రెల్లివీధిలో ఇళ్లలో వరదనీరు చేరకుండా చర్యలు తీసుకోవాలి. లేకుంటే కాలనీ వాసులతో ఆందోళన చేస్తామని హెచ్చరించారు. సంతబొమ్మాళి మండలం తోటాడ-కోటబొమ్మాళి రైల్వే స్టేషన్ మార్గంలో ఆర్అండ్‌బి రోడ్డుపై మంగళగెడ్డ వాగు నీరు ఉధృతంగా ప్రవహించింది. మంగళవారం ఉదయం నుంచి వాహనాలు, ప్రజల రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. అధికారులు కర్రలతో గేట్లు ఏర్పాటు చేసి అడ్డంకులు పెట్టారు. తహశీల్దార్ హేమసుందర్, విఆర్ఒ, విఆర్ఎ, ఆర్అండ్‌బి ఇంజినీర్, పోలీసులు, సర్పంచ్ యర్నాగుల సునీత, రామరాజు పర్యవేక్షిస్తున్నారు.



గొట్టాబ్యారేజీ వద్ద కిందికి విడిచిపెడుతున్న వరదనీరు

వరద నష్టాలపై తక్షణ సహాయక చర్యలు : కలెక్టర్

భారీ వర్షాల ప్రభావంతో సంభవించిన నష్టాలపై తక్షణ సహాయక చర్యలు చేపట్టాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించి అధికారులకు దిశానిర్దేశం చేశారు. వర్ష నష్టాల అంచనాలను వెంటనే పూర్తి చేసి ప్రజలకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. దోమల నివారణకు గంబూసియా చేపలను వదలాలని, నీటి నాణ్యత పరీక్షలు నిర్వహించాలని సూచించారు.

పలుచోట్ల తేలికపాటి జల్లులు

అల్పపీడనం ప్రభావంతో మంగళవారం జిల్లాలో పలుచోట్ల తేలికపాటి జల్లులు కురిశాయి. నరసన్నపేటలో అత్యధికంగా 9 మి.మీ వర్షం కురిసింది. ఇచ్ఛాపురంలో అత్యల్పంగా 0.25 మి.మీ వర్షం పడింది.

ఖాళీ కంచాలతో నిరసన తెలుపుతున్న సెక్యూరిటీ కార్మికులు

బకాయి వేతనాలు చెల్లించాలి

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

రాష్ట్ర ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకుని రిమ్స్ సెక్యూరిటీ కార్మికుల రెండు నెలల బకాయి వేతనాలు చెల్లించాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు, టౌన్ కన్వీనర్ ఆర్.ప్రకాశరావు, కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ నాయకులు బి.మురళి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేకుంటే పోరాటాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. రిమ్స్ కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యాన రెండు నెలల బకాయి వేతనాలు వెంటనే చెల్లించాలని, కార్తికేయ సెక్యూరిటీ కాంట్రాక్టర్ నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి వద్ద సెక్యూరిటీ కార్మికులు ఖాళీ కంచాలతో మంగళవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్తికేయ సెక్యూరిటీ ఏజెన్సీ కార్మికులపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. కార్మికుల సమస్యలు పరిష్కరించాల్సిన అధికారులు నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో 15 ఏళ్లుగా సెక్యూరిటీ గార్డులుగా సేవలందిస్తున్న వారికి సకాలంలో వేతనాలు చెల్లించడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పాత కాంట్రాక్టర్ ఏప్రిల్, మే ఎరియర్స్ చెల్లించలేదని, కొత్త కాంట్రాక్టర్ బాధ్యతలు తీసుకుని రెండు నెలలు పూర్తయినా జూన్, జూలై జీతాలు చెల్లించకపోవడంతో కార్మిక కుటుంబాలు ఆకలి మంటలతో అలమటిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

రిమ్స్ అధికారులు సెక్యూరిటీ సిబ్బందితో పని చేయించుకోవడానికి బాధ్యత తీసుకుంటున్నారు గానీ కార్మికుల వేతనాలకు బాధ్యత తీసుకోకపోవడం సమంజసమా అని ప్రశ్నించారు. ఒకవైపు ధరలు ఆకాశాన్నంటుతుంటే, అతి తక్కువ వేతనాలతో సెక్యూరిటీ సిబ్బంది కుటుంబాలను నెట్టుకురావడం భారంగా మారుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా అధికార యంత్రాంగం వెంటనే జోక్యం చేసుకొని కార్మికుల బకాయి వేతనాలు వెంటనే చెల్లించేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ధర్నా అనంతరం రిమ్స్ సూపరింటెండెంట్ సి.అమూల్యకు యూనియన్ ప్రతినిధులు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో రిమ్స్ యూనియన్ నాయకులు టి.రామారావు, ఎం.సూర్యనారాయణ, కె.రవి, సంతోషి, సావిత్రి, కృష్ణవేణి, ఎ.సూర్యనారాయణ, బి.అప్పన్న, రాజేంద్ర, జి.అప్పన్న తదితరులు పాల్గొన్నారు.

22న జాబ్‌మేళా

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

ఈనెల 22వ తేదీన నగరంలోని నెహ్రూ యువ కేంద్రంలో జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి కె.సుధ ఒక ప్రకటనలో తెలిపారు. ఆరోజు ఉదయం పది గంటలకు బయోడేటా, విద్యార్హత సర్టిఫికేట్‌లు, ఆధార్‌కార్డు జిరాక్సుతో హాజరు కావాలని సూచించారు. అభ్యర్థులు ముందుగా www.ncs.gov.in వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలని తెలిపారు. ఫార్మాసిస్టు, ఫార్మసీ ఎయిడ్, సెక్యూరిటీగార్డు పోస్టులకు మెడ్‌ప్లస్ సంస్థ ఇంటర్వ్యూలు నిర్వహిస్తుందని తెలిపారు. శ్రీకాకుళం, విశాఖపట్నం ప్రాంతాల్లో ఉద్యోగాలు చేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

సమగ్ర శిక్ష ఎపిసిని తొలగించాలి

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

పొందూరు కెజిబివి ప్రిన్సిపాల్, దళిత మహిళ సౌమ్యకు వ్యతిరేకంగా తప్పుడు నివేదికలు ఇచ్చి, జిల్లా ఉన్నతాధికారులను తప్పుదోవ పట్టించిన సమగ్ర శిక్ష ఎపిసి సంపతిరావు శశిభూషణ్‌ను తక్షణమే విధుల నుంచి తొలగించాలని దళిత, ఉద్యోగ, ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. అట్రాసిటీ కేసు నమోదు చేసి విచారణ చేయాలన్నారు. నగరంలోని అంబేద్కర్ విజ్ఞాన్ మందిరంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. సౌమ్యను అక్రమంగా పొందూరు నుంచి కంచిలికి బదిలీ చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. సౌమ్యపై ఎమ్మెల్యే కూన రవికుమార్ అనుచరులు చేస్తున్న ఆరోపణలు, ఆమె ఆత్మహత్యాయత్నంపై సిబిఐ విచారణ చేయాలన్నారు. సౌమ్యపై సమగ్ర శిక్ష ఎపిసి ఉన్నతాధికారులకు ఇచ్చిన నివేదికను తక్షణమే బహిర్గతం చేయాలన్నారు. సౌమ్యపై రవికుమార్ అనుచరులు సోషల్ మీడియాలో వాట్సాప్ గ్రూపుల్లో అసత్య ఆరోపణలు, దుష్ప్రచారం చేస్తున్న వారిపై అట్రాసిటీ చట్టం ప్రకారం కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. సౌమ్య అక్రమ బదిలీకి నిరసనగా ఈనెల 22వ తేదీన సమగ్ర శిక్ష కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టనున్నట్లు తెలిపారు. అనంతరం అంబేద్కర్ కూడలిలో నిరసన కార్యక్రమం చేపట్టారు. రిమ్స్‌లో చికిత్స పొందుతున్న సౌమ్యను పరామర్శించారు. కార్యక్రమంలో దళిత, ప్రజాసంఘాల నాయకులు కంఠ వేణు, ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర నాయకులు రానా శ్రీనివాస్, కెవిపిఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు మిస్క కృష్ణయ్య, దళిత, ప్రజాసంఘాల జిల్లా కన్వీనర్ డి.గణేష్ తదితరులు పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న దళిత, ఉద్యోగ, ప్రజాసంఘాల నాయకులు

పి-4 అమల్లో జిల్లా ముందంజ

కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

పి-4 పథకం అమల్లో రాష్ట్రంలోనే జిల్లా ముందంజలో నిలిచిందని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ వెల్లడించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లా అధికారులతో మంగళవారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. గుర్తించిన 64,166 బంగారు కుటుంబాల్లో 61,552 కుటుంబాలను దత్తత తీసుకోవడం ద్వారా 104 శాతం లక్ష్యం చేరుకున్నామని చెప్పారు. దీంతో 1,55,804 లబ్ధిదారులు ప్రయోజనం పొందుతున్నారని వివరించారు. ఉపాధి హామీ కింద జంగిల్ క్లియరెన్స్, తోటల పెంపకం పనులు వేగంగా సాగుతున్నాయని, వందల కిలోమీటర్ల రహదారులు శుభ్రం చేయడం, వేలాది మొక్కలు నాటినట్లు తెలిపారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కారంలోనూ జిల్లా మంచి పురోగతి సాధించిందన్నారు. 65,569 ఫిర్యాదుల్లో 64,074 పరిష్కరించామని 1,365 మాత్రమే పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. వాటిని త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. ప్రజాభిప్రాయ సర్వేలో వచ్చిన అభిప్రాయాల మేరకు మెరుగైన సేవలు లక్ష్యంగా ముందుకు సాగుతున్నామన్నారు. జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ మాట్లాడుతూ ఆధార్ సీడింగ్‌పై ఒక్క ఫిర్యాదు కూడా రాకూడదని సూచించారు. సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ డి.పృథ్వీరాజ్ కుమార్, జిల్లా రెవెన్యూ అధికారి వెంకటేశ్వరరావు, ప్రత్యేక ఉప కలెక్టర్లు బి.పద్మావతి, జయదేవి, ఇతర శాఖల అధికారులు, తహశీల్దార్లు, ఎంపిడిఒలు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ఎవరినీ విడిచిపెట్టను

- నిరాధార ఆరోపణలు చేసిన వారిపై పరువునష్టం దావా
- అసెంబ్లీ ప్రివిలేజ్ కమిటీకి ఫిర్యాదు చేస్తా
- ఎమ్మెల్యే కూన రవికుమార్

ప్రజాశక్తి - ఆమదాలవలస

వైసిపి నాయకులు, మరికొంతమంది కలిసి పన్నిన కుట్రలో భాగంగా తన వ్యక్తిత్వాన్ని కించపరుస్తూ నిరాధార ఆరోపణలు చేసిన వారందరిపై పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పాటు పరువునష్టం దావా వేస్తానని ఎమ్మెల్యే, పియుసి చైర్మన్ కూన రవికుమార్ అన్నారు. అసెంబ్లీ ప్రివిలైజ్ కమిటీకి ఫిర్యాదు చేస్తానని చెప్పారు. పట్టణంలోని టిడిపి కార్యాలయ ఆవరణలో మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 33 ఏళ్ల తన రాజకీయ జీవితంలో ఏనాడూ ఏ ఒక్కరినీ కించపరిచి అవమానపరిచే విధంగా తాను ప్రవర్తించలేదన్నారు. విధి నిర్వహణలో ప్రజల పక్షాన నిలబడి కెజిబివి ప్రిన్సిపాల్‌ను ప్రశ్నిస్తే, ఆమె తన వ్యక్తిత్వంపై తప్పుడు ఆరోపణలు చేసిందని, దీని వెనుక భారీ కుట్ర దాగి ఉందన్నారు. తనపై ఆరోపణలు చేసిన లోలుగు కెజిబివి ప్రిన్సిపాల్ సౌమ్యతో ఎప్పుడూ ప్రత్యేకంగా మాట్లాడలేదని, కెజిబివి ప్రవేశాల విషయంలో నియోజకవర్గంలోని అందరు ప్రిన్సిపాల్స్‌తో సమగ్ర శిక్ష ఎపిసితో కలిసి వీడియో గ్రూప్ కాల్ నిర్వహించినట్లు తెలిపారు. నియోజకవర్గంలోని వైసిపికి చెందిన ఒక చోటా నాయకుడు రాజకీయం కోసం సౌమ్యను వినియోగించుకోవడానికి సిద్ధమైతే, ప్రభుత్వ ఉద్యోగి అని కూడా మరిచిపోయిన ఆమె మహానటి సావిత్రి నటనకు మించి డ్రామా ఆడుతోందన్నారు. వాస్తవాలను విస్మరించి తప్పుడు ఆరోపణలతో తనపై బురద జల్లడం మంచి పద్ధతి కాదన్నారు. సమావేశంలో డిసిసిబి చైర్మన్ శివ్వాల సూర్యనారాయణ, కళింగ కోమటి కార్పొరేషన్ చైర్మన్ మొదలవలస రమేష్, మాజీ ఎమ్మెల్సీ పీరుకట్ల విశ్వప్రసాద్, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ తమ్మినేని గీతా విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

రవికుమార్‌కు మద్దతుగా కెజిబివి సిబ్బంది

ఎమ్మెల్యే రవికుమార్‌కు మద్దతుగా జిల్లాలోని కెజిబివి ప్రిన్సిపాల్స్, సిబ్బంది విలేకరుల సమావేశం వద్దకు వచ్చారు. బూర్జ, ఆమదాలవలస కెజిబివి ప్రిన్సిపాల్స్ హాజరై వీడియో గ్రూప్ కాల్ మాట్లాడిన రోజు ఎమ్మెల్యే రవికుమార్ సౌమ్యపై ఎటువంటి దుర్భాషలాడలేదని చెప్పారు. ఆవిడే ఎమ్మెల్యే అని కూడా చూడకుండా తిరుగుబాటు చేసిందని తెలిపారు. ఎల్.ఎన్ పేట కెజిబివి ప్రిన్సిపాల్ అంబికా మాట్లాడుతూ సౌమ్య ప్రిన్సిపాల్‌గా ఉన్న కెజిబివిలో అధ్యాపకురాలిగా పనిచేసే సమయంలో ఆమె వేధింపులు భరించలేక మనస్థాపానికి గురై రెండు నెలలకే ఉద్యోగానికి రాజీనామా చేశానని తెలిపారు. మళ్లీ కెజిబివి ఉద్యోగానికి దరఖాస్తు చేసుకుని ప్రిన్సిపాల్ ఉద్యోగం సాధించానని చెప్పారు. కెజిబివి సంఘ నాయకులు మాట్లాడుతూ కెజిబివి ఉద్యోగులందరూ ఎమ్మెల్యే రవికుమార్‌కు బహిరంగ క్షమాపణ చెప్తున్నామన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే రవికుమార్

అంతర్రాష్ట్ర శిక్షణకు యూత్ రెడ్‌క్రాస్ వాలంటీర్లు

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

ఈనెల 22 నుంచి 28వ తేదీ వరకు హర్యానాలోని కురుక్షేత్ర జిల్లాలో నిర్వహించే అంతర్రాష్ట్ర యూత్ రెడ్‌క్రాస్ ట్రైనింగ్ క్యాంపునకు జిల్లా యూత్ రెడ్‌క్రాస్ వాలంటీర్లు ఎంపికయ్యారు. ఉత్తరాంధ్ర నుంచి శ్రీకాకుళం జిల్లా యూత్ రెడ్‌క్రాస్ వాలంటీర్లు చిరంజీవులు, ఎ.నరేష్ (ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల), బి.శరత్‌కుమార్ (కాకినాడ ఆదిత్య డిగ్రీ కాలేజ్) ఎంపికయ్యారు. రాష్ట్రం తరుపున వీరు పాల్గొంటారని రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ పి.జగన్మోహనరావు తెలిపారు. శిక్షణలో నైపుణ్యం ప్రదర్శించి జిల్లాకు పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ ట్రైనింగ్ క్యాంపులో బేసిక్ ఫస్ట్ ఎయిడ్, ఇన్వర్మెంట్ ప్రొటెక్షన్, స్వచ్ఛ భారత్ అభియాన్, మానవతా విలువలు, హక్కులు, డిజాస్టర్ మేనేజ్‌మెంట్, వాలంటరీ బ్లడ్ డొనేషన్, ఐ డొనేషన్, ఆర్గాన్ ట్రాన్స్‌పర్టేషన్, క్విజ్ కాంపిటీషన్, వ్యాసరచన పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

వాలంటీర్లను రెడ్‌క్రాస్ జిల్లా ప్రోగ్రాం మేనేజర్ గొలివి రమణ, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీరాములు, కాకినాడ ఆదిత్య కళాశాల ప్రిన్సిపాల్ ఎన్.వి వేణుగోపాల్ అభినందనలు తెలిపారు.

22లోగా అభ్యంతరాలను తెలియజేయాలి

జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

ఈ-డివిజనల్ మేనేజర్ నియామక పరీక్ష కీలో అభ్యంతరాలను ఈనెల 22వ తేదీలోగా తెలియజేయాలని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ ఒక ప్రకటనలో తెలిపారు. పలాస రెవెన్యూ డివిజనల్ అధికారి కార్యాలయంలో ఖాళీగా ఉన్న ఈ-డివిజనల్ మేనేజరు పోస్టుకు జిల్లా సెలక్షన్ కమిటీ నియామక నోటిఫికేషన్‌కు సంబంధించి ఈనెల పదో తేదీన రాత పరీక్ష నిర్వహించారు. దీనికి సంబంధించి ఫలితాలు, అనుభవానికి మార్కులతో కూడిన ప్రొవిజనల్ జాబితాను జిల్లా వెబ్‌సైట్ srikakulam.ap.gov.inలో ఈనెల 20వ తేదీన ఉదయం 10 గంటలకు ఉంచనున్నట్లు తెలిపారు.

ప్రొవిజనల్ జాబితాలో అనుభవానికి మార్కులపై ఎలాంటి అభ్యంతరాలున్నా ఈనెల 22వ తేదీ సాయంత్రం ఐదు గంటల్లో జిల్లా రెవెన్యూ అధికారికి నేరుగా అందజేయాలని సూచించారు. అభ్యర్థులు వివరాలకు జిల్లా వెబ్‌సైట్‌ను సందర్శించాలని తెలిపారు.

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తదితరులు

క్యూఆర్ కోడ్ స్కాన్ చేస్తే ఇంటికే మట్టి విగ్రహం

ప్రజాశక్తి - శ్రీకాకుళం

వినాయక ఉత్సవాలు పర్యావరణహితంగా నిర్వహించాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పిలుపునిచ్చారు. కలెక్టరేట్‌లో పర్యావరణహిత గణేశ్ చతుర్థి పోస్టర్‌ను మంగళవారం ఆవిష్కరించారు. మట్టి వినాయక విగ్రహాలను వాడడం ద్వారా నదీ జలాలు కలుషితం కాకుండా కాపాడవచ్చన్నారు. ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి పర్యావరణ ఇంజినీర్ బి.కరుణశ్రీ మాట్లాడుతూ పోస్టర్‌లో ఇచ్చిన క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తే ఇంటి వద్దకే మట్టి విగ్రహాలు డెలివరీ అవుతాయన్నారు. ఈనెల 26వ తేదీన సూర్యమహల్ జంక్షన్ వద్ద ప్రత్యేక స్టాల్‌ను ఏర్పాటు చేసి మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేస్తామన్నారు. భక్తిని ఆచరిస్తూనే పర్యావరణాన్ని కాపాడుకుందామని విజ్ఞప్తి చేశారు.

నేడు కానిస్టేబుల్ అభ్యర్థులు హాజరు కావాలి

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

గతేడాది డిసెంబరు, ఈ ఏడాది జనవరిలో ఎచ్చెర్లలోని పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించిన కానిస్టేబుళ్ల ఉద్యోగాల ఎంపిక ప్రక్రియకు హాజరై.. సివిల్, ఎపిఎస్‌పి ఉద్యోగాలకు ఎంపికైన పురుష, మహిళా అభ్యర్థులు తండేవలసలోని జిల్లా పోలీసు శిక్షణా కేంద్రానికి ఈనెల 20వ తేదీన హాజరు కావాలని ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు సెలక్షన్ ప్రక్రియలో దరఖాస్తుతో జతపర్చిన ధ్రువీకరణ పత్రాల ఒరిజినల్స్, గెజిటెడ్ అధికారితో అటెస్టేషను చేయించిన మూడు సెట్ల జిరాక్స్ కాపీలు, మూడు పాస్‌పోర్టు సైజ్ కలర్ ఫొటోలు తీసుకురావాలని సూచించారు. అభ్యర్థి అటెస్టేషన్ ఫారంలో పూర్తి వివరాలు పొందుపరిచిన తర్వాత గెజిటెడ్ అధికారితో తప్పనిసరిగా ధ్రువీకరణ చేయించాలని స్పష్టం చేశారు.

వయోడెక్టు పరిశీలన

ప్రజాశక్తి - ఆమదాలవలస

మున్సిపాల్టీ నాలుగో వార్డు పరిధిలో ఉన్న వయోడెక్ట్‌ను ఆర్‌డిఒ సాయి ప్రత్యూష రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులతో కలిసి మంగళవారం పరిశీలించారు. వయోడెక్టు నుంచి ప్రవహిస్తున్న సాగునీటి లీకులు అవుతున్న పిల్లర్లు ఉన్న ప్రదేశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఇటీవల సోషల్ మీడియాలో తరచూ వయోడెక్టు నుంచి ప్రవహిస్తున్న సాగునీరు ఎక్కడికక్కడ లీకులు అవుతున్నాయని, ఏ క్షణాన కూలుతుందోనని వాహనదారులు, ప్రజలు, రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్న నేపథ్యంలో ఆర్‌డిఒ అధికారులకు పలు సూచనలు చేశారు. సాగునీరు లీకులు కాకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

మహారాజశ్రీ పొందూరు జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
O.S. No. 112/2023

Between:-
కెంబూరు అప్పలనాయుడు .....వాది
And:
గేదెల వాసుదేవరావు .....ప్రతివాది

పై నెంబర్ దావాలో వాది ప్రతివాది పైన ప్రోనోటు బాకి రాబట్టే నిమిత్తం దాఖలు చేసియున్నాడు. సదరు దావాలో ప్రతివాది అయిన గేదెల వాసుదేవరావు గారు పొందూరు కోర్టులో **తేది 20-08-2025న ఉదయం 10.30 గంటలకు** స్వయంగా గాని, వకీలు ద్వారాగా గాని హాజరై అతనికి గల ఆక్షేపనలు తెలియజేయగలరు. అటులు కాని యెడల మీకు వ్యతిరేకముగా తీర్పు ఇవ్వడం జరుగునని ఇందుమూలంగా తెలియజేయడమయినది.

(శ్రీ కోర్టు వారి ఉత్తరువులతో)

పొందూరు,
తేది: 19-08-2025

అడ్రస్:
గేదెల వాసుదేవరావు
S/o లక్ష్మున్నాయుడు,
గేదెలపేట గ్రామం
జి. సిగడాం మండలం,
శ్రీకాకుళం జిల్లా.

ఐ. శ్రీరాములునాయుడు
న్యాయవాది,
పొందూరు,
ఫోన్: 9441289946.

చాక్లెట్‌ను అందజేస్తున్న డిఎస్‌పి వెంకట అప్పారావు

హెల్మెట్ వినియోగం.. సురక్ష ప్రయాణం

కాశీబుగ్గ డిఎస్‌పి వెంకట అప్పారావు

ప్రజాశక్తి- పలాస

ద్విచక్రవాహనదారులు హెల్మెట్లు వినియోగించడం ద్వారా సురక్షిత ప్రయాణం సాగించగలరని కాశీబుగ్గ డిఎస్‌పి వి.వెంకట అప్పారావు అన్నారు. మండలంలోని లక్ష్మీపురం టోల్ ప్లాజా వద్ద మంగళవారం వాహనాలను తనిఖీ చేశారు. రహదారిపై హెల్మెట్ ధరించి మోటారు వాహనాలు నడిపిన వాహనదారులు చాక్లెట్స్ అందించిన అభినందించారు. హెల్మెట్ ధరించకుండా మోటారు వాహనాలను నడిపిన వారిపై కేసులు నమోదు చేసి చలానా కట్టించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతంలో కంటే జాతీయ రహదారి విస్తరించడంతో పెద్ద వాహనాలు వారి గమ్యస్థానాలకు చేరేందుకు వేగంగా నడుపుతుంటారని అన్నారు. ఈ సమయంలో కొన్ని అనుకోని ప్రమాదాలు సంభవిస్తాయని అన్నారు. ఈ క్రమంలో చిన్న వాహనాలైన బైక్‌దారులు మరింత అప్రమత్తంగా ఉండాలన్నారు. మోటారు వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ వాడాలన్నారు. ప్రాణాలు విలువ తెలుసుకొని వాహనాలను నడపాలని హితవు పలకాలన్నారు. కార్యక్రమంలో పోలీస్, టోల్ గేట్ సిబ్బంది పాల్గొన్నారు.

28న జిల్లాస్థాయి క్విజ్ పోటీలు

ప్రజాశక్తి- కవిటి

వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా మండలంలోని కపాసుకుద్దిలో ఈ నెల 28న జిల్లాస్థాయి క్విజ్ పోటీలను గంగామాత యువజన సంఘం ఆధ్వర్యాన నిర్వహిస్తున్నట్లు సభ్యులు తెలిపారు. ఈ పోటీల్లో ప్రతి జట్టులో నలుగురు సభ్యులు మాత్రమే ఉండాలన్నారు. 25 ఏళ్ల లోపు వయసు కలిగినవారే పాల్గొనగలరని నిర్వాహకులు స్పష్టం చేశారు. స్క్రీనింగ్ పరీక్షలో ప్రతిభ కనబరిచిన జట్లకు మాత్రమే తుది పోటీల్లో అవకాశం కల్పిస్తారని వివరించారు. పాల్గొనే జట్టు రూ.వంద చొప్పున ప్రవేశ రుసుం చెల్లించి, తమ పేరును ఈనెల 25లోగా నమోదు చేసుకోవాలని సూచించారు. ప్రథమ బహుమతి రూ.6 వేలు, ద్వితీయ బహుమతి రూ.4 వేలు, తృతీయ బహుమతి రూ.2 వేలు, మెమెంటోలు ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. పాల్గొనేవారందరికీ భోజన సదుపాయం కల్పిస్తామన్నారు. ఆసక్తిగల వారు 6281984148 నంబరుకు సంప్రదించి తమ పేరు నమోదు చేసుకోవాలని నిర్వాహకులు కోరారు.

డిగ్రీ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి- ఆమదాలవలస

పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డిగ్రీ మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు బుధవారం నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్.ఎస్.ఎస్.స్వామి ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాలలో బిఎ (హిస్టరీ) ఆనర్స్ 40 సీట్లు, బిఎ (పాలిటిక్స్) ఆనర్స్ 40 సీట్లు, బికాం (కంప్యూటర్స్) ఆనర్స్ 60 సీట్లు ఉన్నాయని అన్నారు. అనుభవజ్ఞులైన అధ్యాపకులచే బోధన ఉందని తెలిపారు. నాలుగు వేల డిగ్రీ పుస్తకాలతో గ్రంథాలయం, విశాలమైన ఆటస్థలం, ఇంటర్నెట్ సదుపాయం, కంప్యూటర్ ల్యాబ్, బాలికలకు ప్రత్యేక వసతులు, బస్సు పాస్, ఎన్ఎస్ఎస్ యూనిట్ సదుపాయం ఉందన్నారు. ఇంటర్ టిసి, మార్క్స్ లిస్టు, ఆరు నుంచి స్టడీ ధ్రువపత్రం, ఆధార్ కార్డు, తరగతి ధ్రువీకరణ పత్రం, రెండు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు తీసుకుని వచ్చి కళాశాలలోనే రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని తెలిపారు.

నాట్లు పడేదెప్పుడో...!

పెద్దలక్ష్మీపురం వద్ద నాట్లు పడని పొలం

ప్రజాశక్తి- మెళియాపుట్టి

మండల రైతాంగం ఏటా వర్షాధారంపై ఆధారపడి వ్యవసాయం సాగిస్తున్నారు. సాగునీటి వనరులు లేక ఉన్న చిన్నపాటి సాగునీటి చెరువులు దయనీయంగా మారడంతో వర్షం కురిస్తే తప్ప ఖరీఫ్ సాగయ్యే పరిస్థితి ఉండదు. మండల భౌగోళిక పరిస్థితుల దృష్ట్యా తూర్పు ప్రాంతమైన గొప్పిలి, కరజాడ, గోకర్ణపురం, మర్రిపాడు-కె, ముక్తాపురం, చాపరపురం, భరణికోట, ఎస్.కొలిగాం, పరశురాంపురం తదితర పంచాయతీల్లో వర్షాలు అనుకూలంగా పడకపోవడంతో ఈ ప్రాంతపు రైతాంగం వ్యవసాయానికి ఇబ్బందులు పడాల్సి వస్తోంది. మండలంలో 6275.2 వేల హెక్టార్ల విస్తీర్ణం ఉండగా, ఇందులో 2500 వేల హెక్టార్లు పల్లం, 3775.2 హెక్టార్లు మెట్టు ఉంది. దాదాపు 10,114 వేల మంది రైతులు ఉన్నారు. ఏటా జూన్‌లో కురిసిన పడిన వర్షాలు ఆధారంగా ఎదలు వేస్తారు. ఈ ఏడాది అడపాదడపా కురిసన వర్షాలు కారణంగా 12,750 ఎకరాలు వెదలు జల్లారు. ఆగస్టు నెల మూడో వారం అయినా పూర్తిస్థాయిలో వర్షాలు అనుకూలించకపోవడంతో ఇంకా దాదాపు 1145 ఎకరాల్లో వరి నాట్లు పడాల్సి ఉంది. జూన్ నెలలో సాధారణ వర్షపాతం 149.2 మిల్లీమీటర్లు ఉండగా, 63.7 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. జూలైలో 245.9 మిల్లీమీటర్ల వర్షపాతానికి గాను, 87.5 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. 189.6 మిల్లీమీటర్ల వర్షపాతానికి గాను ఈనెల 19 నాటికి 106.9 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

ఆఫ్‌షోర్ రిజర్వాయరు పూర్తయితే...

ఆఫ్‌షోర్ రిజర్వాయరు పనులు పూర్తి చేస్తే మెళియాపుట్టి మండల రైతాంగానికి పూర్తిస్థాయిలో సాగునీరు అందుతుంది. దీంతో రైతుల సమస్య తీరుతుంది. అందుకు సంబంధించి అవసరమైన చోట ఎత్తిపోతల పథకాలను ఆఫ్‌షోర్ కెనాల్, మహేంద్ర తనయా నది వద్ద ఎత్తిపోతల పథకాలను ఏర్పాటు అవసరం.

సాగునీటి వనరులు అభివృద్ధి చేయాలి

సాగునీటి వనరులు అభివృద్ధి చేస్తే మండల రైతాంగానికి అవసరమైన నీరు అందుతుంది. మండల రైతు సంఘం ఏటా వర్షాధారంపై ఆధారపడుతున్నారు. ఆఫ్‌షోర్ రిజర్వాయరు పూర్తి చేయాలి. ఆఫ్‌షోర్, మహేంద్ర తనయా నదుల వద్ద ఎత్తిపోతల పథకాలు ఏర్పాటు చేయాలి.

- పోలాకి ప్రసాదరావు, కౌలు రైతుసంఘం జిల్లా కార్యదర్శి

ఏటా నష్టపోతున్నాం

ఏటా వర్షాధారంపై ఆధారపడుతున్నాం. సకాలంలో వర్షాలు పడక నష్టపోతున్నాం. ఆగస్టు నెలాఖరు అవుతున్నా వర్షాలు, సాగునీరు లేక ఇప్పటి వరకు ఉబాలు చేపట్టలేదు. రైతులకు సాగునీటి వనరులు కల్పించాలి. కూలి పనులు లేకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాం.

- డి.జమ్మయ్య, రైతు

ఆర్‌డిఒతో మాట్లాడుతున్న జెసి ఫర్మాన్ అహ్మద్‌ఖాన్

జెసి స్థల పరిశీలన

కోటబొమ్మాళి: మండల కేంద్రంలోని ఎన్‌టిఆర్, ఎర్రన్నాయుడు పార్కు పక్కన ఉన్న ఖాళీ స్థలంలో డిసిసిబి బ్యాంకు నిర్మాణానికి జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ మంగళవారం స్థలాన్ని పరిశీలించారు. అనంతరం ఆర్‌డిఒ ఎం.కృష్ణమూర్తి, తహశీల్దార్ అప్పలరాజుతో కలిసి కోటబొమ్మాళి పెద్ద చెరువుకు పడిన గండిని వారు పరిశీలించారు. అనంతరం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు.

ప్రశాంతంగా బిఇడి సెమిస్టర్

ఎచ్చెర్ల : డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ విశ్వవిద్యాలయం పరిధిలోని బిఇడి నాలుగో సెమిస్టర్ పరీక్ష ఉమ్మడి జిల్లాలో ఆరు కేంద్రాల్లో మంగళవారం నిర్వహించారు. టెక్కలి, పలాస, రాజాం, పాలకొండల్లో ఒక్కో కేంద్రం, శ్రీకాకుళం పట్టణంలో రెండు కేంద్రాల్లో మధ్యాహ్నం 2 నుంచి 3.30 గంటల వరకు ఈ పరీక్షలను నిర్వహించారు. జిల్లాలోని 14 బిఇడి కళాశాలలకు చెందిన సుమారు 11 వందల మంది విద్యార్థులు ఈ పరీక్షలు రాశారు. ఈ పరీక్షలు ఈ నెల 22 వరకు ఉంటుంటుందని పరీక్షల డీన్ డాక్టర్ ఎస్.ఉదయ్‌భాస్కర్ తెలిపారు. కాగా, ఈ నెల 18న క్యాంపస్ కేంద్రంగా నిర్వహించిన మూడు, అయిదేళ్ల న్యాయ విద్యా కోర్సులకు సంబంధించి వివిధ సెమిస్టర్ల పరీక్షలు వర్షాలు కారణంగా వాయిదా వేశామని, వీటిని సెప్టెంబరు 2న నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఇళ్లల్లోకి వరద నీరు

కొత్తూరు: మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మడ్డుబగ్గి సాగునీటి కాలువ పొంగిపొర్లుతుంది. కాలువలో చెత్తా చెదారం పేరుకుపోవడంతో వరదనీరు స్థానిక రెల్లివీధి ఇళ్లలోకి చేరడంతో ఇబ్బందులు పడుతున్నారు. దీంతో పాటు పలు నిర్మాణాలతో గెడ్డ ఆక్రమణకు గురి కావడంతో ఈ దుస్థితి ఏర్పడింది. ఈ వరద నీరు కళింగపట్నం దమయంతి, సొంది పార్వతీ, సవలాపురపు రాము, బొమ్మాళి సత్యవతి, నిలాపు గంగమ్మ చెందిన ఇళ్లల్లోకి నీరు చొరబడింది. దీంతో బిక్కుబిక్కు మంటూ గడుపుతున్నారు. కనీసం వంట చేసుకునేందుకూ అవకాశం లేకుండాపోయింది. గతేడాది ఇదే పరిస్థితి దాపురించినా అధికార యంత్రాంగం నిమ్మకునీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారని కాలనీ వాసులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు చేసుకోవాలని కోరుతున్నారు.

ఇంట్లోకి చేరిన వరద నీరు

హడ్డుబంగి గెడ్డలోని చెత్తా చెదారాలను, ఆక్రమణలను తొలగించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు శిర్ల ప్రసాద్ డిమాండ్ చేశారు. రెల్లివీధిలో ఇళ్లలో వరదనీరు చేరకుండా చర్యలు తీసుకోవాలి. లేకుంటే కాలనీ వాసులతో ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

పోలీసుల అదుపులో అల్లరిమూక

'ప్రజాశక్తి' కథనానికి స్పందన

ప్రజాశక్తి- లావేరు

మండల కేంద్రం లావేరు సచివాలయంలో ఈ నెల 17న రాత్రి అల్లరిమూకలు అరాచకం చేయ్యడంతో ఈ నెల 19న 'అల్లరిమూకలు అరాచకం' శీర్షికతో 'ప్రజాశక్తి'లో కథనం ప్రచురితమైంది. ఈ కథనానికి పోలీసులు స్పందించారు. లావేరుకు చెందిన కొంతమంది అరాచకానికి పాల్పడిన ఆరుగురు అల్లరిమూక యువకులను పోలీస్‌స్టేషన్‌కి మంగళవారం తీసుకెళ్లి అదుపులో ఉన్నట్లు సమాచారం. ఇటీవల లావేరులో కొన్నాళ్లుగా కొంతమంది అల్లరిమూకలు విధుల్లో రోడ్లపై మద్యం, గంజాయి తాగి ఇళ్ల బయట ఉన్న ద్విచక్ర వాహనాల్లో పెట్రోల్ దొంగనాలకు పాల్పడుతున్నారు. గ్యాస్ బండలు ఎత్తుకెళ్లడం, సచివాలయం తలుపుకు తాళాలు పగలుగొట్టి అందులోనే తాగిన బీరువాలు వేయడం, కంప్యూటర్‌ను చిందరవందర చేశారు. సుభద్రాపురం-చీపురుపల్లి రోడ్డుపై రాత్రి సమయంలో వాహనాలను ఆపడం, భయభ్రాంతులకు గురిచేయడం, కూడలిలో రోడ్లపై బహిరంగంగా మద్యం తాగడం వంటి అరాచకాలకు పాల్పడుతున్నారు. అచార అల్లరిమూకలు దారుణాలకు పోలీసులు కళ్లెం వేయాలని ప్రజలు కోరుతున్నారు.

పశువుల వ్యాను పట్టివేత

పట్టుబడిన వ్యాను

కొత్తూరు : మండలంలోని బలద సంత నుంచి అక్రమంగా తరలిస్తున్న 8 పశువుల వ్యాన్‌ను మంగళవారం ఎస్ఐ మహమ్మద్ అమీర్ ఆలీ మాతల వద్ద దాడి చేసి పట్టుకున్నారు. ఎల్ఎన్‌పేట మండలం పెదకోటకు చెందిన డి.దుర్గారావు, హిరమండమండలం కాలనీ చెందిన తమాడ అప్పారావులు అక్రమంగా పశువులను తరలిస్తున్నట్లు గుర్తించారు. వారిపై కేసు నమోదు చేసి పశువులను గో సంరక్షణ కేంద్రం విజయనగరం జిల్లా గుర్లకు తరలించారు.

రక్షణ కంచె ఏర్పాటు చేసిన అధికారులు

ఉధృతంగా మంగళగెడ్డ

సంతబొమ్మాళి: మండలంలోని తోటాడ-కోటబొమ్మాళి రైల్వే స్టేషన్ మార్గంలో ఆర్‌అండ్‌బి రోడ్డుపై మంగళగెడ్డ వాగు నీరు ఉధృతంగా ప్రవహిస్తోంది. మంగళవారం ఉదయం నుంచి వాహనాలు, ప్రజల రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. అధికారులు కర్రలతో గేట్లు ఏర్పాటు చేసి అడ్డంకులు పెట్టారు. పరిస్థితిని తహశీల్దార్ హేమసుందర్, విఆర్ఒ, విఆర్ఎ, ఆర్‌అండ్‌బి ఇంజినీర్, పోలీసులు, సర్పంచ్ యర్నాగుల సునీత, రామరాజు పర్యవేక్షిస్తున్నారు.

కాశీనగర్ సమీపంలో నీట మునిగిన పంట పొలాలు

నీట మునిగిన పొలాలు

పర్లాకిమిడి : గజపతి జిల్లా కాశీనగర్ పట్టణంలో మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు రోడ్లు, పొలాలు జలమయామయ్యాయి. కాశీనగర్ పట్టణం ఆనుకొని ఉన్న భూములు పూర్తిగా నీటమునిగాయి. మెయిన్ రోడ్ మీదుగా నీరు ప్రవహిస్తుంది. ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

ఎదుగుదల చూసి ఓర్వలేక...

చినబాబు

కవిటి: ఆమదాలవలస ఎమ్మెల్యే, రాష్ట్ర పియుసి కమిటీ సభ్యుడు కూన రవికుమార్ ఎదుగుదల చూసి ఓర్వలేక కొంతమంది అసత్య, నిరాధార ఆరోపణలు చేస్తున్నారని, ఇది మంచిపద్ధతి కాదని కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ బార్ల చిన్నబాబు ఒక ప్రకటనలో ఆగ్రహం వ్యక్తం చేశారు. దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు ఆయన తెలిపారు. రాష్ట్ర రాజకీయాల్లో దూసుకెళ్తూ, ప్రజల్లో ఆదరణ కలిగిన రవికుమార్‌ను ప్రజా క్షేత్రంలో నెగ్గలేక వ్యక్తిగతంగా ఇటువంటి చౌకబారు ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. వీటిని ప్రతి ఒక్కరూ ఖండించాలని అన్నారు. భవిష్యత్‌లో ఇటువంటి జరగకుండా వాటిని ప్రోత్సహిస్తున్న వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

రక్షిత నీటి పథకానికి క్లోరినేషన్

క్లోరినేషన్ చేస్తున్న సిబ్బంది

పొందూరు: మండలంలోని రాపాకలో ఉన్న రక్షిత తాగునీటి పథకం ట్యాంకుకు మంగళవారం సర్పంచ్ కొంచాడ వనజ ఆధ్వర్యాన క్లోరినేషన్ చేపట్టారు. గ్రామంలోని రక్షిత నీటి పకథానికి సరఫరా చేసే బావిని శుభ్రం చేయడం, ట్యాంకులో క్లోరినేషన్ చేశారు. కార్యక్రమంలో కార్యదర్శి పి.శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీలో మాట్లాడుతూ ప్రిన్సిపాల్ వెంకటలక్ష్మి

పరిశుభ్రతతో క్షయ దూరం

పలాస : పరిసరాల పరిశుభ్రత పాటిస్తే క్షయ వ్యాధి దూరం చేసుకోవచ్చని పలాస ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జె.వెంకటలక్ష్మి అన్నారు. యూత్ రెడ్‌క్రాస్ సొసైటీ కో-ఆర్డినేటర్ ఎల్.గణపతి ఆధ్వర్యాన నిర్వహించిన ప్రధానమంత్రి టిబి ముక్త భారత్ అభియాన్ ర్యాలీ మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ టిబి అనేది ఇప్పుడు క్రమం తప్పకుండా చికిత్స చేయించుకుంటే పూర్తిగా నయమవుతుందని అన్నారు. క్షయవ్యాధిపై ప్రజల్లో ఉన్న భయాన్ని తొలగించి, అవగాహన పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. అలాగే, జన్ భాగిదారి ద్వారా పరిశుభ్రతను పాటించడం టిబి నిర్మూలనలో కీలకమైన అంశమని ఆమె అన్నారు. కార్యక్రమంలో ఐక్యూఎసి కో-ఆర్డినేటర్ పి.వెంకటరమణ, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ పి.మధు, లైబ్రేరియన్ బి.నరసింహులు పాల్గొన్నారు.

రూ.20 వేలు ఆర్థికసాయం

సంతబొమ్మాళి : మండలంలోని వడ్డితాండ్ర పంచాయతీ కొత్తూరుకు చెందిన మండల వేణు బోన్ క్యాన్సర్‌తో బాధపడుతున్నాడు. చికిత్స ఖర్చులకు రూ.25 లక్షలు అవుతుందని వైద్యులు తెలిపారు. చేపల వృత్తితో జీవిస్తున్న కుటుంబం పరిస్థితి తెలుసుకున్న అమెరికాకు చెందిన వి.ఫర్ నీడ్ సంస్థ మంగళవారం రూ.20 వేలు ఆర్థికసాయం అందించింది. ఈ మొత్తాన్ని మనబడి వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు విద్యార్థి కుటుంబానికి అందజేశారు.

వైసిపి నాయకుల పరామర్శ

పరామర్శిస్తున్న వైసిపి నాయకులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

ఆత్మహత్యాప్రయత్నం చేసి శ్రీకాకుళం రిమ్స్‌లో చికిత్స పొందుతున్న పొందూరు కెజిబివి ప్రిన్సిపాల్ ఆర్.సౌమ్యను మంగళవారం వైసిపి నాయకులు పరామర్శించి, ఆరోగ్య పరిస్థితి తెలుసుకున్నారు. మాజీ మంత్రి మేరుగు నాగార్జున, వైసిపి జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్ మాట్లాడుతూ మాట్లాడుతూ తమ పార్టీ అధినేత జగన్మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు తామంతా ఇక్కడికి వచ్చామని అన్నారు. సౌమ్యకు బాసటగా ఉంటామన్నారు ఈమెను ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ ఇష్టానుసారంగా వేధించి మానసికంగా ట్రోల్ చేశారని, ఇది హేయమైన చర్య అని మండిపడ్డారు. టిడిపి కూటమి పాలనలో దళితులు, ఆదివాసీలకు రక్షణ కరువైందని ఆవేదన వ్యక్తం చేశారు. అలానే సివిల్ సర్వీస్ అధికారులు సైతం కూటమి పాలకులు ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. సౌమ్య ఆత్మహత్య ప్రయత్నంపై సమగ్ర విచారణ నిర్వహించాలని డిమాండ్ చేశారు. అధికారుల విధుల నిర్వహణలో రాజకీయ జోక్యం సరికాదని అన్నారు.

రికార్డులను పరిశీలిస్తున్న కమిషనర్ రవి

మెరుగైన వైద్యం అందించాలి

మున్సిపల్ కమిషనర్ రవి

ప్రజాశక్తి- ఆమదాలవలస

పట్టణ పరిధిలోని రోగులకు మెరుగైన వైద్యం అందించాలని అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యులు బి.సురేష్‌కు మున్సిపల్ కమిషనర్ తమ్మినేని రవి సూచించారు. పట్టణంలోని మోణింగి వారి వీధిలో ఉన్న అర్బన్ హెల్త్ సెంటర్‌ను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా హెల్త్ సెంటర్ సిబ్బంది హాజరు పట్టిక రోగులకు అందజేస్తున్న వైద్య సేవలు సిబ్బంది విధి నిర్వహణ తదితర అంశాలను సమగ్రంగా పరిశీలించారు. హెల్త్ సెంటర్ పరిసర ప్రాంతాల్లో శానిటేషన్ పరిస్థితులను పరిశీలించి, శుభ్రతను కాపాడాలని సూచిస్తూ సిబ్బందికి పలు సూచనలు చేశారు. హెల్త్ సెంటర్‌లో లభ్యమయ్యే ఔషధాల స్టాక్ రిజిస్టర్‌ను తనిఖీ చేసి అవసరమైన ఔషధాల సరఫరా నిరంతరాయంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత సిబ్బందిని ఆదేశించారు. హెల్త్ సెంటర్‌లో ఉన్న అన్ని వార్డులను సందర్శించి, అక్కడి రోగులతో మాట్లాడి అందుతున్న వైద్య సేవలు సదుపాయాలపై వివరాలను అడిగి తెలుసుకున్నారు. రోగులు తెలిపిన సమస్యలు అవసరాలపై ప్రత్యేకంగా దృష్టి పెట్టాలని సూచించారు. ఈ సందర్భంగా మెడికల్ హెల్త్ ఆఫీసరు శ్రీనివాసరావు మాట్లాడుతూ హెల్త్ సెంటర్‌కు వచ్చే ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు ఆరోగ్య సేవలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కమిషనర్ మాట్లాడుతూ వాతావరణ పరిస్థితుల దృష్ట్యా సీజనల్ వ్యాధులు సంక్రమించే అవకాశాలు ఉన్నాయని, సిబ్బంది అప్రమత్తంగా ఉండి సకాలంలో వైద్య సేవలు అందించాలని అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ రెవెన్యూ బిల్ కలెక్టర్ డి.రవి ఫార్మసిస్టు చింతాడ వరుణ్‌కుమార్, ల్యాబ్ టెక్నీషియన్ ఉపేంద్ర, స్టాఫ్‌నర్సులు పాల్గొన్నారు.

అయ్యా! మాకు పింఛను వస్తుందా?

ప్రజాశక్తి- కవిటి

పుట్టు మూగదైనా నా బిడ్డ వికలాంగురాలు కాదా? వైకల్యం శాతం తక్కువైదంటూ నా బిడ్డ పింఛనుకు అర్హురాలు కాదని నోటీసు పంపించారు. పుట్టినప్పటినుంచి మాటలు రాని నా బిడ్డ వికలాంగురాలు కాకపోతే ఇంకెవరు వికలాంగులో మీరే చెప్పండయ్యా అంటూ పెద్ద కర్రివానిపాలెంకు చెందిన కర్రి భారతమ్మ తల్లి అధికారులను వేడుకుంది. తమకు న్యాయం చేసి తన బిడ్డకు ఎప్పటిలా వికలాంగ పింఛను అందేలా చర్యలు తీసుకోవాలని కోరింది. వైకల్యం శాతం తక్కువగా ఉందంటూ మండలంలోని పలువురు వికలాంగులకు నోటీసులు అందాయి. వారందరూ మంగళవారం ఎంపిడిఒ కార్యాలయానికి చేరుకుని ప్రత్యేక అధికారి చిట్టిబాబు, ఎంపిడిఒ శ్రీనివాసరెడ్డికి తమ గోడు వెల్లబోసుకున్నారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ మండలంలో వికలాంగ పింఛను

ఎంపిడిఒకి జిరాక్సులు అందిస్తున్న బాధితులు

తీసుకుంటున్న 90కి నోటీసులు అందినట్టు తెలిపారు. నోటీసులు అందిన వారందరూ వారికి అందిన నోటీసు, సదరం ధ్రువీకరణ పత్రాలు పాతది - కొత్తది, ఆధార్ కార్డు జిరాక్స్, రేషన్ కార్డు జిరాక్స్ జతచేసి కార్యాలయంలో అందజేయాలని సూచించారు. వీటిని ఆయా సచివాలయాల ఆధ్వర్యాన ఉన్నతాధికారులకు పంపించనున్నట్లు తెలిపారు. వీరందరికీ ప్రభుత్వం ప్రకటించిన తేదీలో అర్హత పరీక్షలు ఉంటాయని అన్నారు.

ఎమ్మెల్యే రవికుమార్‌పై అసత్య ఆరోపణలు

ప్రజాశక్తి- నరసన్నపేట

ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్‌పై పొందూరు కెజిబివి ప్రిన్సిపాల్ సౌమ్య చేసిన అసత్య ఆరోపణలను కళింగ కార్పొరేషన్ చైర్మన్ రోణంకి కృష్ణంనాయుడు అన్నారు. నరసన్నపేటలో తన నివాస గృహంలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. ఇటీవల సోషల్ మీడియాలో సౌమ్య చేస్తున్న ఆరోపణలు నిరాధారమైనవి అన్నారు. ఎటువంటి ఆధారాలు లేకుండా నిందారోపణలు చేయడం సమంజసం కాదన్నారు. ఉద్యోగుల బదిలీలు సర్వసాధారణమని, ప్రతిపక్షాలతో కలిసి రాద్ధాంతం చేయడం సరికాదని అన్నారు.

మాట్లాడుతున్న కృష్ణంనాయుడు

సమావేశంలో డాక్టర్ దువ్వాడ జీవితేశ్వరరావు, జల్లు చంద్రమౌళి, కె.రమేష్‌బాబు, పూజారి శైలజ, పి.వేణుగోపాలరావు, కిల్లి లక్ష్మణరావు, కిల్లి వేణు, పుల్లారావు, సిహెచ్.త్రినాథరావు పాల్గొన్నారు.

పంటల బీమా వినియోగించుకోవాలి

కంచిలి : పంట రుణం తీసుకున్న రైతులంతా పంటల బీమా అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిఎసిఎస్ అధ్యక్షుడు పైల పురుషోత్తంరెడ్డి, సిఇఒ రామారావు ఒక ప్రకటనలో కోరారు. కంచిలి ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘంలో రుణాలు తీసుకున్న రైతులందరూ పంటల బీమా కోసం, ఈ నెల 28 లోగా ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకానికి పేరు నమోదు చేసుకోవాలని కోరారు. ఎకరాకు రూ.160 ప్రీమియం చెల్లించాలన్నారు. ఇందుకు రైతులు తమ యొక్క ఆధార్, 1బి, కో-ఆపరేటివ్ బ్యాంకు ఖాతా, నామిని వివరాలతో కంచిలి పిఎసిఎస్ కార్యాలయాన్ని సంప్రదించాలని కోరారు.

పేదవాడి ఆకలి తీర్చడమే ధ్యేయం

మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఈశ్వరరావు

ప్రజాశక్తి- రణస్థలం రూరల్

ప్రతి పేదవాడీఆకలి తీర్చడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు అన్నారు. మండల కేంద్రంలో అన్న క్యాంటీన్ భవన నిర్మాణానికి మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో మాట్లాడుతూ రూ.60 లక్షలతో భవన నిర్మాణం చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. నియోజకవర్గంలో అన్న క్యాంటీన్ ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. నిత్యం వేలాది మంది పేదలు, కూలీలు ఆకలి తీర్చే అన్న క్యాంటిన్ ఏర్పాటుకు అవకాశం కల్పించిన సిఎం చంద్రబాబుకు ధన్యవాదములు తెలిపారు. కార్యక్రమంలో డిసిఎంఎస్ చైర్మన్ చౌదరి అవినాష్, తహశీల్దార్ సనపల కిరణ్ కుమార్, ఎంపిడిఒ ఈశ్వరరావు, లంక శ్యాం, డిజిఎం ఆనందరావు, పిషిని జగన్నాథం నాయుడు, పిన్నింటి భానోజీ నాయుడు పాల్గొన్నారు.

ఒక్క క్లిక్... వెయ్యి జ్ఞాపకాలు

కవిటి : కార్యక్రమంలో పాల్గొన్న ఫొటోగ్రాఫర్లు

ప్రజాశక్తి- కవిటి

'ఫొటో ఒక క్షణాన్ని శాశ్వతంగా నిలుపుతుంది' అనే నినాదంతో ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని ఫొటోగ్రాఫర్స్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యాన కవిటిలో ఘనంగా నిర్వహించారు. లోల్ల నారాయణ మూర్తి కళ్యాణ మండపంలో నిర్వహించిన ఈ అవగాహన కార్యక్రమంలో పర్లాకిమిడి, హరిపురం, నరసన్నపేట, శ్రీకాకుళం ప్రాంతాల నుంచి వచ్చిన అనేక మంది ఫొటోగ్రాఫర్లు పాల్గొన్నారు. విజయవాడకు చెందిన మెంటల్ శివాజీ మెలకువలు నేర్పించారు. ఫొటోగ్రఫీ చరిత్ర, ఆధునిక డిజిటల్ టెక్నాలజీతో వస్తున్న మార్పులు, ఫొటోగ్రఫీ వృత్తి అవకాశాలపై శివాజీ వివరణ ఇచ్చారు. 'క్లిక్ వెనుక సృజనాత్మకత ఉంటేనే ఫొటోకు ప్రాణం వస్తుంది' అని పాల్గొన్న ఫొటోగ్రాఫర్లు అన్నారు. ముఖ్యంగా సమాజంలో ఫొటోగ్రాఫర్ల పాత్ర, మానవ భావాలను లెన్స్ ద్వారా వ్యక్తపరచడంలో ఫొటోగ్రఫీ ప్రాముఖ్యతను ప్రత్యేకంగా చర్చించారు. ఈ సందర్భంగా ప్రతిభ కనబరుస్తున్న ఫొటోగ్రాఫర్లను సన్మానించి, ఫొటోగ్రఫీ రంగానికి మరింత ప్రోత్సాహం అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో ఫొటోగ్రాఫర్స్ సర్వీస్ సొసైటీ ఆరింగి గోపి, ఉపాధ్యక్షుడు బల్ల అశోక్, రాము, ఆనంద్ గజపతి, సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

రణస్థలం: మండల కేంద్రంలో ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. రామతీర్థాల రోడ్డులో ఉన్న కోటి ఫొటో స్టుడియోలో కెమెరా సృష్టికర్త లూయిస్ మాండ్ డాగురె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేసి, కేక్ కట్ చేశారు. ఫొటోగ్రాఫర్లు ఐక్యత వర్ధిల్లాలి అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో రణస్థలం, లావేరు మండల ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ యూనియన్ అధ్యక్షులు బి.కోటేశ్వరరావు, గిడుతూరి నీలకంఠం, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

కంచిలి : ఉద్దానం ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యాన స్థానిక మార్కెట్ కమిటీ యార్డు వద్ద మంగళవారం ఉచిత రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ప్రపంచ ఫొటోగ్రాఫర్స్ డే పురస్కరించుకొని ఉద్దానం బ్లడ్ బ్యాంక్, రెడ్‌క్రాస్ సంస్థ సంయుక్తంగా నిర్వహించిన ఈ శిబిరంలో 50 యూనిట్ల రక్తాన్ని సేకరించినట్లు నిర్వాహకులు తెలిపారు. అనంతరం యార్డు ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో సోంపేట సిఐ మంగరాజు, స్థానిక ఎస్ఐ పారినాయుడు, తహశీల్దార్ రమేష్, ఇన్‌ఛార్జి ఎంపిడిఒ వీరభద్రస్వామి, సంఘ అధ్యక్షుడు పి.రాజశేఖర్ పాల్గొన్నారు.



కంచిలి : రక్తదానం చేస్తున్న యువకుడు

రణస్థలం : కేక్ కట్ చేస్తున్న ఫొటోగ్రాఫర్లు



రిపోర్టులను పరిశీలిస్తున్న కృష్ణచైతన్య

కృష్ణచైతన్య పరామర్శ

ప్రజాశక్తి- నరసన్నపేట

మండలంలోని లుకలాంలో అనారోగ్యంతో బాధపడుతున్న సర్పంచ్ సేనాపతి శ్రీనివాస్ భార్యను పోలాకి జెడ్‌పిటిసి ధర్మాన కృష్ణచైతన్య మంగళవారం పరామర్శించారు. ఈయనతో పాటు పొందర కూరకుల కార్పొరేషన్ విభాగ అధ్యక్షులు రాజపు అప్పన్న, మండల అధ్యక్షులు లుకలాపు రవి, నియోజకవర్గ పంచాయతీ రాజ్ అధ్యక్షులు బగ్గు రమణయ్య, నియోజకవర్గ బూత్ కమిటీ అధ్యక్షులు సురంగి నర్సింగరావు, మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షులు యాబాజీ రమేష్, వైస్ ఎంపిపి చింతల వెంకటరమణ పాల్గొన్నారు.

వరి సాగును పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

వరి క్షేత్రం పరిశీలన

కోటబొమ్మాళి: ఖరీఫ్ సీజన్‌లో రైతులు సాగు చేస్తున్న వరి సాగుకు పొటాష్ లోపం ఉందని, దీని నివారణకు 20 కేజీల మ్యురేట్ ఆఫ్ పొటాష్‌ను ఎకరాకు వేసుకోవాలని ఆముదాలవలస కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు జి.ఎస్.రాయ్, డాక్టర్ హరిలు అన్నారు. మండలంలోని శ్రీజగన్నాథపురంలోని వరి క్షేత్రాలను పరిశీలించారు. మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలు రైతులకు బాగా ఉపయోగపడతాయని తెలిపారు. కార్యక్రమంలో ఎఒ ఎస్.గోవిందరావు, ఎఇఒ బి.అరుణ, విఎఎ బాలకృష్ణ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి

దీనబంధుపురంలో

బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ

ప్రజాశక్తి- మెళియాపుట్టి

మండలంలోని దీనబంధుపురం పంచాయతీలో వైసిపి రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి 'బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీ' కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి, పాలనకు, కూటమి పాలనకు మధ్య ఉన్న వ్యత్యాసాలను ప్రజలకు వివరించారు. చంద్రబాబు సూపర్ సిక్స్' వంటి అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చారని అన్నారు. సంవత్సర కాలం గడిచినా ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చలేదని అన్నారు.

అధికారుల పరిశీలన

కవిటి : మండలంలోని ఇద్దివానిపాలెంలో మండల ప్రత్యేకాధికారులు జి.శ్రీనివాసరావు, చిట్టిబాబులు మంగళవారం పర్యటించారు. పొగరుకు అడ్డంగా వేసిన ఇసుక మూటలు పరిశీలించి మత్స్యకారులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎంపిడిఒ శ్రీనివాస రెడ్డి, డిప్యూటీ ఎంపిడిఒ వరప్రసాద్, జెఇ ప్రవీణ్‌కుమార్, విఆర్ఒ దివాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక మేట్లను పరిశీలిస్తున్న అధికారులు

సేంద్రీయ ఎరువులపై దృష్టి

లావేరు : అవగాహన కల్పిస్తున్న ఎడిఎ శ్రీనివాసరావు

లావేరు: రైతులు అంతా రసాయన ఎరువులకు స్వస్తి చెప్పి సేంద్రీయ ఎరువులపై దృష్టిసారించాలని రణస్థలం ఎడిఎ వడ్డాది శ్రీనివాసరావు సూచించారు. లావేరులో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రసాయన ఎరువులు అధికంగా ఉపయోగించడం వల్ల భూమి సారవంతం తగ్గిపోతుందని అన్నారు. తొలకరికి ముందు పచ్చిరొట్టి ఎరువులు వేసుకోవాలని, భూమిలో ఒకే పంట సాగు చేయకుండా పంట మార్పిడి విధానాన్ని పాటించాలని చెప్పారు. పప్పు దినుసులు రకాలతో పంట మార్పిడి చేయాలని సూచించారు వేరు సెనగలో కదిరి 6 సికే 6 లేపాక్షి వంటి మేలులైన రకాలు సాగు చేయాలన్నారు. పంట మార్పిడి అవగాలతో చేస్తే భూమి సారవంతంగా అవుతుందని తెలిపారు. వ్యవసాయనికి అనుబంధంగా పాడిని అభివృద్ధి చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎఒ డి.మహేష్ నాయుడు, ఎఇఒ బగాది ప్రమీల, విఎఎ పి.సుమాంకా పాల్గొన్నారు.

నందిగాం : ఖరీఫ్ సీజన్‌లో రైతులు వరి పైరుపై సస్యరక్షణ చర్యలు చేపడితే అధిక దిగుబడులు పొందవచ్చునని ఎఒ పి.శ్రీకాంత్‌వర్మ అన్నారు. మండలంలోని వెంకన్నపేటలో పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహించారు.

నందిగాం : అవగాహన కల్పిస్తున్న ఎఒ శ్రీకాంత్‌వర్మ

వికలాంగులు ఆందోళన చెందవద్దు

మాట్లాడుతున్న కమిషనర్ రామారావు

ప్రజాశక్తి- పలాస

రద్దయిన వికలాంగ పింఛనుదారులు ఆందోళన చెందవద్దని, దరఖాస్తు చేయించి వారి పునరుద్ధరించేందుకు చర్యలు తీసుకుంటామని మున్సిపల్

కమిషనర్ రామారావు

కమిషనర్ ఎన్.రామారావు అన్నారు. పలాస-కాశీబుగ్గ పురపాలక సంఘం కార్యాలయంలో వెల్ఫేర్ కార్యదర్శులతో మంగళవారం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రద్దయిన వికలాంగ పింఛనుదారులతో మరలా దరఖాస్తు చేయించి ఈ పురపాలక సంఘం కార్యాలయంలో కమిషనర్ లాగిన్‌లో అప్‌లోడ్ అయ్యేటట్టు చూడాల్సిన బాధ్యత కార్యదర్శులదేనని అన్నారు. మరలా వైద్యులతో వైద్య పరీక్షలు చేయించి పింఛను మంజూరుకు చర్యలు తీసుకుంటామన్నారు.

నారాయణవలస సంత వేలంపాట ఖరారు

కోటబొమ్మాళి: మండలంలోని నారాయణవలస గురువారం పశువుల సంత వేలం పాట మంగళవారం ఖరారైంది. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన వేలంపాటకు కోటబొమ్మాళి మండలం నారాయణవలసకు చెందిన టి.సంతోషి, జలుమూరు మండలం పెద్దదూగాంకు చెందిన తర్ర గణపతిరావులు పాటలో పాల్గొన్నారు. సంతోషి రూ.80.05,000లకు పాటను పాడగా, ఆమెపై రూ. 5 వేలు అదనంగా వేసి గణపతిరావు రూ.80.10,000లకు పాటను సొంతం చేసుకున్నారు. వచ్చే ఏడాది మార్చి 31 వరకు ఆశీలు వసూళ్ల చేసుకోవచ్చునని ఎంపిడిఒ కె.ఫణీంద్రకుమార్ తెలిపారు.

వేలంపాట నిర్వహిస్తున్న అధికారులు

నేత్రాలను పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది

నేత్ర వైద్య శిబిరానికి స్పందన

సంతబొమ్మాళి: మండలంలోని నౌపడ రామమందిరంలో నారాయణ కమలం శ్రేయోనిధి ఆధ్వర్యాన శ్రీకాకుళం జిల్లా అంధత్వ నివారణ సంస్థ సహకారంతో శంకర్ ఫౌండేషన్ సౌజన్యం మంగళవారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 120 మందికి నేత్ర పరీక్షలు చేసి, 40 మందికి కేటరాక్ట్ శస్త్రచికిత్సలు అవసరమని నిర్ధారించారు. వీరిని శ్రీకాకుళం శంకర్ ఫౌండేషన్ నేత్రాస్పత్రికి తరలించారు. కార్యక్రమంలో స్థానిక వైద్యాధికారి పరిమళ, ఆప్తాల్మిక్ అధికారి ఎం.ఆర్.కె.దాస్, ఆప్టోమెట్రిస్టు ఎస్.అంజలి, శ్రేయోనిధి కమిటీ సభ్యులు, క్యాంప్ కో-ఆర్డినేటర్ టి.రామారావు పాల్గొన్నారు.

140 మందికి వైద్య పరీక్షలు

ప్రజాశక్తి- పొందూరు

పట్టణంలోని సత్యసాయి సేవా మందిరంలో రాగోలు జెమ్స్ ఆధ్వర్యాన మంగళవారం ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 140 మందికి వైద్య పరీక్షలను నిర్వహించారు. రోగులకు ఇసిజి, 2డి ఎకో, సుగర్, బిపి, నేత్ర పరీక్షలను నిర్వహించి ఉచితంగా మందులను అందజేశారు. ఇందులో 25 మందిని ప్రత్యేక పరీక్షలకు ఆస్పత్రికి రిఫర్ చేశారు. కార్యక్రమంలో సత్యసాయి సేవాసమితి కన్వీనర్ దున్న రాధాకృష్ణ, వైద్యులు పాల్గొన్నారు.

మందులు అందజేస్తున్న సభ్యులు

ఉబాలు వేస్తున్న కూలీలు

ముమ్మరంగా ఉబాలు

ప్రజాశక్తి- పలాస

గత మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు గెడ్డలు వాగులు చెరువులు వరద నీటితో నిండు కుండలా దర్శనమిస్తున్నాయి. లొత్తూరు కొండలపై కురిసిన వర్షాలకు వరహాల గెడ్డ ఉధృతంగా ప్రవహిస్తోంది. ఇదిలా ఉండగా పంట పొలాల్లో నీరు నిల్వ ఉండడంతో రైతులు ఉబాలు వేసే పనిలో నిమగ్నమయ్యారు. తర్లకోట, లొద్దభద్ర, సున్నాడ, కొత్తపూరు తదితర ప్రాంతాల్లో ముమ్మరంగా ఉబాలు జరుగుతున్నాయి. ప్రస్తుత వర్షాలు, వంశధార కాలువ ద్వారా నీరు వస్తుండడంతో మరో నాలుగైదు రోజుల్లో వందల ఎకరాల్లో రైతులు ఉబాలు చేపట్టే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. ఏదేమైనప్పటికీ ఆగస్టు చివర సమయంలో ఉబాలు ఊపందుకున్నాయి.

వేడి నీటిని తాగాలి

ఆముదాలవలస : వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు కాచి చల్లార్చిన నీటిని తాగాలని మున్సిపల్ కమిషనర్ తమ్మినేని రవి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నాలుగు రోజుల నుంచి కురుస్తున్న భారీ వర్షాల వల్ల పట్టణ ప్రజలందరూ ఎటువంటి అంటూ వ్యాధులు విషజ్వరాలు ప్రబల కుండా ఉండేందుకు కాచి చల్లార్చిన నీటిని మాత్రమే తాగాలని అన్నారు.

ఎమ్మెల్యే దగ్గుపాటిపై చర్యలు తీసుకోవాలి

శంకర్

పలాస : సినీ నటుడు జూనియర్ ఎన్‌టిఆర్‌పై దురుసుగా వ్యాఖ్యలు చేసిన అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్‌పై చర్యలు తీసుకోవాలని జూనియర్ ఎన్టీఆర్ అభిమానుల సంఘం మండల అధ్యక్షుడు శంకర్ కోరారు. ఈ మేరకు మంగళవారం విలేకరులతో మాట్లాడారు. ప్రజలు మిమ్మల్ని ఎన్నుకొని ఎదురు చూస్తుంది మీరు ఏదో మంచి చేస్తారని, అంతే కానీ సంబంధం లేని విషయాలలో తలదూర్చినోటికి వచ్చిన మాటలు అంటే అభిమానులు చూస్తూ ఊరుకోరని స్పష్టం చేశారు. వచ్చే ఎన్నికల్లో అభిమానులు ఓట్లతో సమాధానం చెప్పాల్సి ఉంటుందన్నారు.

ఎరువులు సరఫరా చేయాలి

కోటబొమ్మాళి: రైతులకు సరిపడా ఎరువులను సరఫరా చేయాలని వైసిపి మండల అధ్యక్షులు సంపతిరావు హేమసుందరరాజు కోరారు. ఈ సందర్భంగా మంగళవారం విలేకరులతో మాట్లాడారు. ఎరువులు లేక రైతులు నానా ఇబ్బందులు పడుతుంటే మంత్రి అచ్చెన్నాయుడుకు పట్టకపోవడం సరికాదన్నారు. అసలు రైతులకు ఎరువుల సమస్య లేనట్లుగా మంత్రి వ్యవహరిస్తున్నారని విమర్శించారు.

మట్టిని తొలగిస్తున్న ప్రొక్లెయినర్

వర్షపునీరు తొలగింపు

కొత్తూరు : మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు నివగాం ఆర్అండ్‌బి రోడ్డు గోతులమయమైంది. దీంతో వర్షపునీరు నిల్వ ఉండడంతో పాదచారులు, వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. దీంతో స్పందించిన తహశీల్దార్ కె.బాలకృష్ణ మంగళవారం ప్రొక్లెయినర్‌తో ఇరువైపులా తాత్కాలికంగా పనులు చేపట్టారు. వర్షపు నీరు కాలువ ద్వారా బయటికి వెళ్లేందుకు పరిష్కార మార్గాన్ని చూపారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ గురవయ్య పాల్గొన్నారు.